క్లుప్తంగా

బోధనపై ప్రత్యేక దృష్టి : డీవైఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈవో

నింద్ర : ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని డీవైఈఓ ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన నింద్ర జిల్లా ఉన్నత పాఠశాలను సోమవారం పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల హాజరు వివరాలు, భోధనా అంశాలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఏకతా దినం



చరిత్రపై అవగాహన కలిగిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ

వెదురుకుప్పం : మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఏకతా దినం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ మాట్లాడుతూ.. ఏకతా దినం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఆర్థికశాస్త్రం , చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులందరూ చరిత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శివయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజ అలంకరణలో స్కంధుడు



మహారాజ అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

నగరి : పట్టణ పరిధి కరకంబేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో స్కంధ షష్టి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి మహారాజ అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ చేశారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ స్వామికి మహారాజ అలంకరణ చేసి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం వారు బిల్వార్చన చేశారు.ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రామలింగాపురం ప్రాథమి కోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ మేరకు పప్పు, కూరగాయలు, గుడ్లు ప్రతి రోజు సక్రమంగా పెట్టాలని కోరారు. బియ్యాన్ని మంచి నీటితో కడిగిన తరువాతనే అన్నం చేయాలన్నారు. రసం, సాంబార్‌కు తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పాఠశాల ఆవరణలోనే చేయాలని, ఇంటి వద్ద చేసుకుని వచ్చి విద్యార్థులకు పెట్టకూడదని నిర్వాహకులను హెచ్చరించారు.

కళాశాల ప్రహరీ సమీపంలో వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహం

నగరి : మున్సిపల్ పరిధి పాండురాజపురం జగనన్న కాలనీలో నివాసముంటున్న గోవర్ధన్ అలియాస్ నాగరాజు (44) స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ సమీపంలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అతిగా మద్యం తాగిన సమయంలో ఫిట్స్ రావడమే మృతికి కారణమని సీఐ మహేశ్వర్ వెల్లడించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు.

మాలాధారణ..
నియమాల తోరణం

- ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షదారులు
- భక్తి భావంతో ఆరోగ్యం మెరుగు

కార్తీక మాసం మొదలు మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప దీక్షల కోలాహలం కనిపిస్తుంది. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపే అయ్యప్ప దీక్ష. ఎంతో పవిత్రత, నిష్టతో 41 రోజుల పాటు కఠిన దీక్షలు ఆచరించిన స్వాములు ఇరుముడులు ధరించి శబరిమల అయ్యప్పను దర్శించుకుంటారు. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు ఎక్కాలి. ఈ మెట్లను అధిరోహించడం ద్వారా అజ్ఞానం తొలగి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షదారుల నమ్మకం.



పాలసముద్రంలో మాల ధరించి భజనలు చేస్తూ వస్తున్న స్వాములు

పాలసముద్రం : విలువలు పెంపొందించుకునేందుకు అయ్యప్ప దీక్ష దోహదపడుతుంది. మాలాధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూతి, చందనం, కుంకుమతో అలంకరించుకోవడం ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మధారణ ఈశ్వర సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తు చేస్తాయి.ఇలా అయ్యప్పదీక్ష మనిషిలో చెడు గుణాలు తొలగి, మంచి గుణాలు పెంపొంది జీవనవిధానంలో మార్పు కనిపిస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

41 రోజుల దీక్ష ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. భక్తి భావంతో పాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది అయ్యప్ప దీక్షలను తీసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడం, నేల మీద పడుకోవడం, కండరాల పటిష్టత, రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్య మెరుగుపడుతుంది.

మార్పునకు అవకాశం



అయ్యప్ప దీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉంటాయి. మాలధారణ వల్ల ఆధ్యాత్మిక చింతనతో పాటు తనను మార్చుకునే అవకాశం ఉంటుంది. క్రమశిక్షణ అలవడుతుంది. నిష్ఠతో దీక్ష చేసేవారు ఆదర్శంగా నిలుస్తారు.

– రవి, సీఎం కండ్రిగ

విలువలు పెంపొందుతాయి



నేను పదేళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నా, నడవడిక, జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. మాలధారణతో మనిషిలో విలువలు పెంపొందుతాయి. మాలధారణ నియమాలు మనిషి ఎదుగుదలకు దోహదపడుతాయి.

– శేఖర్, సింహరాజుపురం,

స్నేహభావం పెరుగుతుంది



అయ్యప్ప మాలధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తమ విధిని గుర్తిస్తారు. సంఘ జీవిగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలో అలవరచుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది.

– విజయకుమార్, శ్రీకావేరిరాజుపురం

పాపాలు తొలగిపోతాయనే నమ్మకం



అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులు రోజు రోజుకు పెరుగుతున్నారు. మాల ధరించినప్పటి నుంచి భక్తి శ్రద్ధలతో 41 రోజులు కఠిన దీక్ష ఉండి. ఇరుముడి కట్టుకుని పంబా నదిలో స్నానం చేస్తే చేసిన పాపాలు తొలగిపోతాయనే నమ్మకం.

– రాజేష్ కుమార్, పాలసముద్రం

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



ఆలయ ఆవరణంలో కోలాటం వేస్తున్న మహిళలు

పాలసముద్రం : మండల పరిధిలోని రాచపాలెం గ్రామంలో వెలసిన బాల గురునాథేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు నిర్వహించారు. స్వామి వారి ఎదుట వేద పండితులచే వివిధ యాగశాల పూజలు చేశారు. అనంతరం భక్తులు అంగరంగ వైభవంగా బెంగళూరు నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం వేయటం భక్తులను ఆకట్టుకుంది. మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కార్తీక పూజల్లో రోజా

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా సోమవారం తన నివాసంలో కార్తీకమాస పూజలు నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి బిల్వార్చన పూజలు చేశారు. పూజలో పాల్గొన్న వారికి ప్రసాదాలు అందజేశారు.





స్వామి దర్శనానికి హాజరైన భక్తులు, లింగాభిషేక పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నేడు మండల సమావేశం

నగరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

బెల్టుషాపులపై దాడులు



మహిళను అరెస్టు చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారంలో బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మద్యం సీసాలను ఉంచుకున్న లక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం నగరి పోలీసులకు అప్పగించారు. తరచూ బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర, పీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదు



ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తవణంపల్లె: ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే సీఎం చంద్రబాబుపై తిరుగుబాటు తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్దన్ హెచ్చరించారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం మండలంలోని అరగొండ సచివాలయం దగ్గర నిరసన తెలియజేశారు. అనంతరం అరగొండ సచివాలయ కార్యనిర్వహణాధికారి మురుగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్దన్, కార్యదర్శి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు రైతులకు పెట్టుబడి సాయం రూ.13,500 నుంచి రూ.20 వేలుకు పెంచి ఇప్పటి వరకు మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడం దుర్మార్గమన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించి హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు మండలాల ప్రకటనలో వివక్ష చూపరాదన్నారు. పాడి రైతులను ఆదుకోవడానికి వెంటనే విజయ డైరీని ప్రారంభించాలని, చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, హంద్రీనీవా కాలువ పూర్తి చేయాలని, విశాఖ ఉక్కును ప్రైవేటు చేయరాదని, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవఅధ్యక్షులు ఎస్.నాగరాజన్, రైతు నాయకులు బాలచందర్, అశోక్, రామచంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ వినతులపై నిర్లక్ష్యం వద్దు



దివ్యాంగుడి సమస్యలు వింటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్వీకరించారు. ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక వినతులను పరిష్కరించండి

శ్రీరంగరాజపురం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వచ్చాయి. అందులో ముటేషన్ 05, శ్మశాన వాటికలకు దారి 01, డీకేటీ పట్టా కేటాయించాలని 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్‌పట్టా మంజూరు చేయాలని 02, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 04, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01 వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు , ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలపై అవగాహన



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ లక్ష్మీపతి

పుత్తూరు: సన్నకారు రైతులు , వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారికి రుణ సదుపాయాలను గ్రామీణ బ్యాంకులు అందుబాటులోకి తీసురానున్నట్లు గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ లక్ష్మీపతి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీపతి మాట్లాడుతూ.. గ్రామీణ ఉత్పాదకతను, రుణ సౌలభ్యత పెంచడానికి గ్రామీణ బ్యాంకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్లు సంగీత, శ్రీనివాస్, అధ్యాపకులు దేవకి, వాసవి, తిరుమలయ్య, గంగయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరకు పంటతో అధిక దిగుబడులు



రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న శాస్త్రవేత భక్షిరామ్

కార్వేటినగరం : రైతులు చెరకు పంటతో అధిక దిగుబడులు సాధించాలంటే కొత్త పద్ధతులు అవలంబించాలని శాస్త్రవేత్త భక్షిరామ్ తెలిపారు. సోమవారం అనూరు గ్రామంలో సాగర్ షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో చెరకు సాగులో కొత్త పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్షిరామ్ మాట్లాడుతూ.. రెండున్నర అడుగులకు దూరంగా చెరకును నాటాలన్నారు. పంట మార్పిడి విధానం అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటలపై రైతులకు అవగాహన తప్పనిసరిగా అవసరమని పేర్కొన్నారు. అధిక దిగుబడులు రావాలంటే సంబంధిత అధికారుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓలు దామోదరం, భక్తవత్సల, ఫీల్డ్ ఆఫీసర్లు శంఖర్ మూర్తి, మురళి, రాంబాబు, రైతులు లోకనాధం, దొరైరాజు, బాబురెడ్డి దనగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత రైలు ప్రయాణమే లక్ష్యం



రైల్వే డీఎస్పీ హరితచంద్ర

పుత్తూరు : సురక్షిత రైలు ప్రయాణం తమ బాధ్యతని, అందుకు తగ్గ రైల్వే పోలీస్ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి రైల్వే డీఎస్పీ ఎస్.ఆర్. హరితచంద్ర తెలిపారు. సోమవారం ఆమె పుత్తూరు రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దు స్టేషన్లలో మరింత నిఘా పెంచినట్లు తెలిపారు. అక్రమ రవాణాతో పాటు రైళ్లలో చోరీల నియంత్రణకు తగిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటామని చెప్పారు. నిత్యం రైళ్లలో తనిఖీలను నిర్వహిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరిస్తున్నామన్నారు. రైళ్లలో, ప్లాట్‌ఫామ్స్‌పై ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే ఆర్పీఎఫ్ పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే సీఐ యతేంద్ర, ఎస్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో ఎస్పీ మణికంఠ



గుడిమల్లం దర్శించిన ఎస్పీ దంపతులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోల్, ఆయన సతీమణి రైల్వే డీఎస్పీ హర్షిత సందర్శించారు. కార్తీక సోమవారం సందర్భంగా స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. రాహుకాల అభిషేకంలో వారు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆహ్వానం పలికారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు ఆశీర్వాదం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలని సూచించారు. తవణంపల్లె పీహెచ్‌సీలో ప్రసవాలు చేస్తున్నట్లు వివరించారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లకుంటలో ఉచిత వైద్య శిబిరం

మండలంలోని మల్లకుంటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలిచ్చారు.

అభ్యసన మదింపునకే నాస్

- విద్యార్థుల ప్రతిభ గుర్తింపునకు పరీక్ష
- పరీక్షలకు ముమ్మరంగా ఏర్పాట్లు
- ఓఎంఆర్ విధానంలో నిర్వహణ
- బోధనా సామర్థ్యాల అంచనాకు తోడ్పాటు



సత్రవాడ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులు

నగరి : విద్యార్థుల్లోని స్థాయిని గుర్తించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా విద్యావ్యవస్థలో నిరంతర కసరత్తు జరుగుతోంది. సగటు విద్యార్థి తరగతి వారీగా అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఎప్పటికప్పుడు సరికొత్త సంస్కరణలు తీసుకొస్తున్నారు. బడి బాటపడుతున్న పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో? తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) నిర్వహించేలా క్షేత్ర స్థాయిలో అమలు చేపట్టింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి నాస్ సర్వే నిర్వహిస్తోంది. 2021లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఎస్సీఈఆర్టీల నేతృత్వంలో సర్వే నిర్వహించనున్నారు.

ప్రణాళిక రూపొందించడం

విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే ఈ సర్వేలో భాగంగా పరీక్షల ద్వారా సామర్థ్యాల మదింపు చేపడతారు. దానిని అనుసరించి బోధనాభ్యసన ప్రణాళికను రూపొందిస్తారు.

నాస్ సర్వేకు ముందుగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే మండల స్థాయిలో చేపట్టనున్నారు. ఈ సర్వే ఈనెల 19న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. దీని ఆధారంగా పిల్లల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేసేందుకు ఉపయోగపడుతుంది. విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకొచ్చే వెసులుబాటు కలుగుతోంది.


నిర్వహణ ఇలా ..

నియోజకవర్గంలో 302 పాఠశాలల్లో 19,209 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది నాస్ సర్వేలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో 3, 5, 8 తరగతులకు ఈ పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 4,700 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపల్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌లు ఈ పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓ 1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు.

ప్రాక్టీస్ పేపర్లతో తర్ఫీదు

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే ఈ పరీక్షలకు ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు అందిస్తారు. తద్వారా ఈ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. 3.6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతికి సంబంధించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతికి సంబంధించిన సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. 3, 6 తరగతుల విద్యార్థులు 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయం, 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాసేందుకు సమయం కేటాయిస్తారు.

అవగాహన శక్తిని అంచనా వేసేందుకు..



విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మదింపు, అవగాహన శక్తిని అంచనా వేసేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపకరిస్తుంది. వీటి ఫలితాలను అనుసరించి బోధనాభ్యసన ప్రణాళికలను రూపొందిస్తారు. సర్వేలో, భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు అదేశాలు జారీ చేశాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో ఈ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ముమ్మర కసరత్తు చేపడుతున్నాం.

– శ్రీదేవి, ఎంఈవో, నగరి